వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం

సామూహిక గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ఆలయ సిబ్బంది, భక్తులు

యాదగిరిగుట్ట, నవంబర్ 1 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయం తోపాటు అనుబంధ పాతగుట్ట (పూర్వగిరి) ఆలయంలో శుక్రవారం స్వాతినక్షత్ర పూజలు ఘనంగా జరిగాయి. స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా అష్టోత్తర శతఘటాభిషేకం వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మండపంలో 108 కలశాలను ఏర్పాటు చేసి గంగా, సప్తనదీ జలాలు, మామిడి, తమల పాకులు, దర్భలు, పూలమాలలు, కొబ్బరికాయలతో అలంకరించారు. పంచామృతాల తోపాటు సుగంధ ద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. ఆయా దేవతల మూల మంత్ర పఠనాలతో హోమ పూజలు నిర్వహించారు. ప్రధానాలయంలో కొలువుదీరిన స్వయంభూ పంచనారసింహస్వామి, సువర్ణ ప్రతిష్ఠా అలంకార మూర్తులను వేద మంత్రాలతో అష్టోత్తర శతఘటాభిషేక పూజలు నిర్వహించి సువర్ణపుష్పాలతో అర్చించారు. సాయంత్రం స్వాతి జన్మన క్షత్రం సందర్భంగా స్వామివారిని దివ్య మనోహరంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. తెల్లవారుజాము నుంచే భక్తులు గిరిప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఉదయం ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతును చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతును జరిపారు. కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి నిత్యకల్యాణ తంతును నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని గరుఢ వాహనంపై, అమ్మవారికి తిరుచ్చి సేవపై వేంచేపు చేసి జోడు సేవను తిరువీధుల్లో ఊరేగించారు. ప్రధానాలయ ముఖ మండపంలో దర్బార్ సేవలో భాగంగా సువర్ణమూర్తులకు ప్రత్యేక పూజలు జరిపి నక్షత్ర హారతినిచ్చారు. రాత్రి స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. అమ్మవారికి ఊంజల్ సేవను అత్యంత వైభవంగా జరిపారు. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్య మనోహరంగా అలంకరించిన అర్చకులు ఊంజల్ సేవలో తీర్చిదిద్ది తిరువీధుల్లో ఊరేగించారు. అద్దాల మండపంలో వేదమంత్ర పఠనాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్థాన విద్యాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. సువర్ణమూర్తులకు పలు దఫాలుగా సువర్ణపుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. దీపావళి పర్వదినం పురస్కరించుకుని గురువారం ప్రధానాయంలో ధనలక్ష్మీవ్రతాన్ని నిర్వహించారు. స్వామివారిని 10వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖ జానాకు రూ.26,21,358 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

సామూహిక గిరి ప్రదక్షిణలో పాల్గొన్న కలెక్టర్

స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రంలో భాగంగా దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక గిరి ప్రదక్షిణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 6:05 గంటలకు స్వామివారి వైకుంఠ ద్వారం వద్ద ప్రారంభమైన గిరి ప్రదక్షిణలో కలెక్టర్ హనుమంతరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు పాల్గొన్నారు. కొండ చుట్టూ పాదయాత్ర నిర్వహించారు. అనంతరం కొండపైకి వెళ్లి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

పూర్ణగిరిలో గిరి ప్రదక్షిణ

పూర్ణగిరి లక్ష్మీనరసింహస్వామి గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 1 : మండలంలోని నమాత్‌పల్లి స్వయంభూ పూర్ణగిరి సుదర్శన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం పురస్కరించుకుని శుక్రవారం లక్ష్మీనరసింహస్వామి ఉపాసకులు బత్తిని రాములుగౌడ్ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఉదయం 5గంటల నుంచి స్వామివారి కొండ చుట్టూ వందలాది మంది భక్తులతో ప్రదక్షిణ చేపట్టి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి పవన్‌కుమార్‌శర్మ, పూజారి వెంకటేశ్, భక్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలి : సీపీఎం

ధాన్యం రాశులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 1 : మండలంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని బస్వాపురం గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులను గురువారం పరిశీలించి మాట్లాడారు. రైతులు ధాన్యం తెచ్చి 25 రోజులవుతున్నా కొనుగోళ్లు చేయడం లేదన్నారు. వర్షానికి ధాన్యం తడిసిపోతుంటే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కేంద్రాలను వెంటనే ప్రారంభించి తడిసిన ధాన్యాన్ని షరతులు లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. దొడ్డు ధాన్యానికి కూడా రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అన్నంపట్ల కృష్ణ, మద్దెపురం బాలనర్సింహ, భాస్కర్, చంద్రయ్య, దేవేందర్, జహంగీర్, రైతులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా లక్ష్మీనారాయణ

బీబీనగర్, నవంబర్ 1 : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా మండలంలోని వెంకిర్యాల గ్రామానికి చెందిన చింతల లక్ష్మీనారాయణను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో అనేక పోరాటాల్లో లక్ష్మీనారాయణ పాల్గొని మంచి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరిగేలా, వారి హక్కులు సాధించేవరకు పోరాటం చేస్తానని లక్ష్మీనారాయణ అన్నారు.

5న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి : సీఐటీయూ

మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సోములు

రామన్నపేట, నవంబర్ 1 : భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 5న చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గొరిగె సోములు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సీఐటీయూ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక శాఖ అధికారుల నిర్లక్ష్యంతో నెలలు గడుస్తున్నా లేబర్ కార్డు క్లైములు కావడం లేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కల్లూరి నగేశ్, రసాల రమేశ్, గొల్లూరి నాగరాజు, మల్లేశ్, వెంకట్‌రెడ్డి, ఆదిమల్లయ్య, నూకల సైదులు, ప్రసాద్, చెన్నయ్య పాల్గొన్నారు.

కుల గణన పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ హనుమంతరావు

మోత్కూరు అంగన్‌వాడీ కేంద్రంలో బాలమృతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.హనుమంతరావు

అడ్డగూడూరు, నవంబర్ 1 : కులగణనను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. తాసీల్దార్ కార్యాలయాన్ని, ప్రభుత్వ దవాఖానను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ దవాఖానలో అన్ని రకాల మందులు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ల్యాబ్ టెక్నీషియన్, కంప్యూటర్ ఆపరేటర్ లేరని మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే డీఎంహెచ్‌ఓతో ఫోన్‌లో మాట్లాడి కొండమడుగులో ముగ్గురు ఎందుకు.. ఒకరిని వెంటనే ఇక్కడికి పంపాలని ఆదేశించారు. పీఏసీఎస్, ఐకేపీ అధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని డీటీ సత్యనారాయణను ఆదేశించారు. అనంతరం ధర్మారం గ్రా మ శివారులో బిక్కేరు వాగులో నిర్మించిన చెక్ డ్యామ్‌ను ఎమ్మెల్యే మందుల సామేల్‌తో కలి సి పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓ కృష్ణారెడ్డి, మండల ప్రత్యేకాధికారి కృష్ణ, ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీఓ ప్రేమలత పాల్గొన్నారు.

పోషక లోపం ఉన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

మోత్కూరు : పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. మున్సిపాలిటీలోని అంగన్‌వాడీ కేంద్రం-2ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీలో పిల్లలకు అందించే గుడ్లు, బాలామృతం నాణ్యత, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అంగన్‌వాడీలో బాలింతలకు, గర్భిణులకు, పిల్లలకు అందిస్తున్న పోషకాహారం గురించి టీచర్ శోభను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులకు సులభతరంగా అర్థమయ్యే విధం గా విద్యాబోధన చేయాలన్నారు.

ధాన్యం తూకం వేయడం లేదని రైతుల ఫిర్యాదు

మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులను కలెక్టర్ పరిశీలించారు. కాంటా వేయడం లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మిల్లు కేటాయించకపోవడం వల్లే ధాన్యం కొనుగోలు చేయడం లేదని సంఘం సీఈఓ కొణతం వరలక్ష్మి తెలిపారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. మున్సిపాలిటీ కేంద్రంలోని 12వ బ్లాక్‌లో ఇంటింటి సర్వేను పరిశీలించారు. ప్రతి కుటుంబంలోని సభ్యుల వివరాలను సేకరించాలని, సర్వే ఫార్మాట్‌లో పొందుపర్చిన అంశాలను కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, తాసీల్దార్ రాంప్రసాద్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఎంపీడీఓ ఎండీ నిరంజన్ వలీ, మార్కెట్ సూపర్ వైజర్ ఎం.శివకుమార్, ఏఈఓ టి.గోపీనాథ్, ఎంపీఓ జనార్దన్ పాల్గొన్నారు.

అధికారులు సమర్థవంతంగా పని చేయాలి

గుండాల, నవంబర్ 1 : అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎం.హనుమంతరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన తాసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ధరణి పెండింగ్ ఫైళ్లను త్వరగా పూర్తిచేయాలన్నారు. దేవాదుల కాల్వ కింద పాసుపుస్తకంలో రెండు సార్లు కట్ అయిన రైతులు అధైర్యపడొద్దని, వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమగ్ర కుటుంబ సర్వేను సమర్థవంతంగా చేయాలని తాసీల్దార్ జలకుమారికి సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు టార్పాలిన్లు ఇస్తున్నారా.. తేమను చూస్తున్నారా? తేమను చూసే పరికరం ఎక్కడ అని అడిగారు. లేదని నిర్వాహకులు చెప్పగా పీఏసీఎస్ సీఈఓ నాగయ్యకు ఫోన్ చేసి ఎప్పటికప్పుడు తేమ శాతాన్ని చూసి రైతులకు తెలియజేయాలని అన్నారు. ఈ క్రమంలో ఆ యన నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసి నాగయ్యను సస్పెండ్ చేయాలని డీసీఓ శ్రీధర్‌ను ఆదేశించారు. తేమ శాతాన్ని ఎప్పటికప్పుడు చూడ టం లేదని ఏఈఓ క్రాంతికుమార్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రైతులకు టార్పాలిన్లు, ధాన్యం శుద్ధి చేసే మిషన్లు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని తాసీల్దార్ జలకుమారిని ఆదేశించారు. ఆ తర్వాత మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను, ఓపీ రిజిస్టర్లను పరిశీలించారు. సెలవులో ఉన్నట్లు తప్పుగా చూపుతూ 15 రోజుల నుంచి విధులకు గైర్హాజరైన సీహెచ్‌ఓ వెంకటేశం, పీహెచ్‌ఎన్ వనజ, హెల్త్ సూపర్ వైజర్ కరుణకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ల్యాబ్ టెక్నీషియన్ రేఖ సెలవులో ఉన్నట్లు సెలవు పత్రాన్ని తాను వస్తున్నారన్న సమాచారంతో అప్పటికప్పుడు సిబ్బందే రాశారని, సంతకం ఆమె చేయలేదని కలెక్టర్ గుర్తించి వైద్యాధికారి హైమావతిని ప్రశ్నించారు. పీహెచ్‌ఎన్ అంటే ఏమిటో చెప్పని డాక్టర్ హైమావతిపై అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటివి మరోసారి చర్యలు తీసుకుంటామని ఆమెను హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రత పాటించాలని, పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. యునాని వైద్య సేవలపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేసి వైద్యాధికారి డాక్టర్ యూనస్‌ను అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి : కలెక్టర్

ఆత్మకూరు (ఎం) : మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమను పరిశీలించి మాట్లాడారు. రైతులందరూ పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని మద్దతు ధర పొందాలన్నారు. ఆయన వెంట భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, మండల ప్రత్యేకాధికారి రాజారాం, ఎంపీడీఓ రాములునాయక్, డిప్యూటీ తాసీల్దార్ సఫియుద్దీన్, ఆర్ఐ మల్లికార్జున్‌రావు, ఏటీఎం ఫకీరయ్య, ఏఈఓ మనీషా ఉన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : దీపావళి పండుగను జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. గురు, శుక్రవారాలు ప్రజలు తమ ఇండ్ల ముందు ముగ్గులు వేసి దీపాలు వెలిగించారు. పటాకులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. కొంతమంది నోములు, , సత్యనారాయణ వ్రతాలు చేపట్టారు. ఇండ్లు, వ్యాపార సముదాయాలను మామిడి తోరణాలు, పూలు, విద్యుత్ వెలుగులతో సుందరంగా అలంకరించారు.

రాజాపేట : పాముకుంటలో ముగ్గు వేసి దీపాలు పెడుతున్న మహిళలు

ఆలేరు రూరల్ : కొలనుపాకలో ఇంటి ముందు దీపాలు వెలిగిస్తున్న యువతి

ఆత్మకూరు(ఎం) శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆత్మకూరు(ఎం)లో నోము పూజల్లో కుటుంబ సభ్యులు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో యువకుడి మృతి

ఉదయ్‌కుమార్ (ఫైల్)

ఆలేరు రూరల్, నవంబర్ 1 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని శారాజీపేట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శారాజీపేటకు చెందిన దూడల ఉదయ్‌కుమార్ (26) దీపావళి నోముల సందర్భంగా ఇంటిపైన లైట్లు బిగిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు. అనంతరం ఉదయ్ మృతదేహాన్ని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

చౌటుప్పల్ రూరల్, నవంబర్ 1 : పంతంగి టోల్‌ప్లాజా వద్ద డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఇద్దరిని చౌటుప్పల్ పోలీసులు బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారంతో పంతంగి టోల్‌ప్లాజా వద్ద చౌటుప్పల్ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారులో పరిశీలించగా.. వంద గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ లభించింది. డ్రగ్‌ను స్వాధీనం చేసుకొని రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన చైల్‌సింగ్(38), సుమేర్‌సింగ్(29)ను అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్‌ను హైదరాబాద్‌లోని లింగంపల్లి నుంచి రాజస్థాన్‌కు రవాణా చేస్తున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు.

ప్రైవేట్ ట్రావెల్స్ ఢీకొని దంపతుల దుర్మరణం

నరసింహారెడ్డి, సరోజనమ్మ (ఫైల్)

చౌటుప్పల్ రూరల్, నవంబర్ 1 : మండలంలోని దండు మల్కాపురం గ్రామ పరిధిలోని 65వ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా ఉప్పలగూడెం గ్రామానికి చెందిన బొబ్బిలి నరసింహారెడ్డి, బొబ్బిలి సరోజనమ్మ దంపతులు గురువారం తెల్లవారుజామున కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో దండు మల్కాపురం గ్రామం వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన ప్రైవేటు ట్రావెల్ బస్సు కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరసింహారెడ్డి (60), సరోజ జిని(55) అక్కడికక్కడే మృతిచెందారు. కారు డ్రైవర్ మహేశ్ తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మృతుల కుటుంబాన్ని పరామర్శించారు.

'పీఆర్‌సీ అమలు చేయాలి'

రామన్నపేట, నవంబర్ 1 : పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కడెం సోమయ్య, రాష్ట్ర సహ అధ్యక్షుడు లచ్చుమల్ల వెంకన్న అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సంఘం జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. 317జీఓతో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కడెం దాసు, అధ్యక్షుడిగా లచ్చుమల్ల వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా కడెం సోమయ్య, సహ అధ్యక్షులుగా పంతంగి సత్తయ్య, సంయుక్త కార్యదర్శులుగా మేకల సూరిబాబు, వల్లమల్ల భాస్కర్, కోశాధికారిగా పాల్వంచ హరికిషన్, జిల్లా కార్యదర్శులుగా కుంచం నర్సింహులు, సంగెం రవి, మహిళా ఉపాధ్యక్షులుగా బొల్లెద్దుల అనూరాధ ఎన్నికయ్యారు.

గీత కార్మికుడికి ఆర్థిక సాయం

ఆలేరు రూరల్, నవంబర్ 1 : ఇటీవల తాటిచెట్టు పైనుంచి పడి గాయాలపాలైన కొలనుపాక గ్రామానికి చెందిన గీత కార్మికుడు మాటూరి నాగరాజుగౌడ్‌కు గ్రామ యువ నాయకులు శుక్రవారం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు మాసాపేట రాజుగౌడ్, నాయకులు దూడల సాగర్, నమిలె రాజయ్య, భీమగోని సారయ్య, మిట్టపల్లి పాండు, భాస్కర్ పాల్గొన్నారు.

దీపావళి సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును హైదరాబాద్‌లో కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

లక్ష్మీనరసింహ స్వామి పార్‌బాయిల్డ్ మిల్లులో మిల్లు యజమానులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

వలిగొండ, నవంబర్ 1 : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని మిల్లర్లు వెంటనే దిగుమతి చేసుకోవాలని, రైతులను ఇబ్బంది పెట్టొద్దని అదనపు కలెక్టర్ వీరారెడ్డి మిల్లుల యజమానులను ఆదేశించారు. మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ స్వామి, హనుమాన్ పార్‌బాయిల్డ్ మిల్లులను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లుల యజమానులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టొద్దన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యాన్ని కాంటా వేసి కేటాయింపుల వారీగా మిల్లులకు పంపిస్తామని, లారీల్లో వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే దిగుమతి చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. అనంతరం నాతాళ్లగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ కరుణాకర్‌రెడ్డి, మిల్లుల యజమానులు, రైతులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో వైద్య సేవలు అంచెలంచెలుగా మెరుగు

- ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

మాట్లాడుతున్న ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్, నవంబర్ 1 : బీబీనగర్ ఎయిమ్స్‌లో రోగులకు వైద్యసేవలు అంచెలంచెలుగా మెరుగుపడనున్నాయని ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా అన్నారు. మండలంలోని ఎయిమ్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎయిమ్స్‌లో భవన నిర్మాణాలు కొనసాగుతున్నందున ఎమర్జెన్సీ సేవలు అందించలేకపోతున్నామన్నారు. జనవరి 2025లోగా ఓపీ సేవలను ఏ బ్లాక్ నుంచి సీ బ్లాక్‌కు మారుస్తామని తెలిపారు. ఎయిమ్స్‌లో ఇంటర్నేషనల్ లెవెల్ వ్యాక్సినేషన్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఎయిమ్స్ ముందు ఉన్న గేట్ 1, 3 ముందు అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. అండర్ పాస్ ఏర్పాటు ద్వారా రోగులకు ఇబ్బందులు లేకుండా ఉంటుందన్నారు. బీబీనగర్ రైల్వే స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ ఎయిమ్స్ వరకు ఆధునీకరించాలని, దాంతో ఎయిమ్స్‌కు వచ్చే రోగులకు సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. ఎయిమ్స్‌లో 40 విభాగాలను అభివృద్ధి పరుస్తున్నామన్నారు. ఎయిమ్స్‌లో విద్యార్థులకు గుడ్ టీచింగ్, రోగులకు గుడ్ కేర్, గుడ్ రీసెర్చ్‌ను అందించాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు.

'డీవైఎఫ్‌ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి'

మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 1 : వలిగొండలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) జిల్లా ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశ్, ఉపాధ్యక్షుడు దయ్యాల మల్లేశ్ తెలిపారు. మండలంలోని అనాజిపురం గ్రామంలో గురువారం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యువతకు అనేక హామీలు ఇచ్చి మోసం చేసిందన్నారు. మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా పేరుతో యువతకు ఉపాధి కల్పిస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. నిరుద్యోగాన్ని, నిరుద్యోగ శాతాన్ని తగ్గించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం యూత్ డిక్లరేషన్ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటాలు చేస్తున్న డీవైఎఫ్‌ఐ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా మీజీ అధ్యక్షుడు అబ్దుల్లాపురం వెంకటేశ్, నాయకులు వెంకటేశ్, రఫిక్, శివ, ప్రవీణ్, గణేశ్, భానుప్రకాశ్, ప్రణయ్, చందు, సిద్ధు, కరీం పాల్గొన్నారు.

దివీస్ కంపెనీ ఎదుట రైతుల ఆందోళన

దివీస్ పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

చౌటుప్పల్, నవంబర్ 1 : మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెంలో గల దివీస్ పరిశ్రమ ఎదుట తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఆరెగూడెం గ్రామ రైతులు గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పరిశ్రమ వెదజల్లుతున్న వ్యర్థాలతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయన్నారు. దీని మూలంగా శ్వాసకోస, చర్మ వ్యాధులు వస్తున్నాయని పేర్కొన్నారు. భూగర్భ జలాలు కలుషితమవడంతో తాగునీటిని ట్యాంకర్ల ద్వారా తెచ్చుకుంటున్నామని తెలిపారు. పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

'నాయీ బ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలి'

ఆత్మకూరు(ఎం), నవంబర్ 1 : నాయీ బ్రాహ్మణులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని నాయీ బ్రాహ్మణ సేవాసంఘం మండలాధ్యక్షుడు బొల్లెపల్లి శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయీ బ్రాహ్మణ వృత్తి దారులందరికీ రూ.2లక్షల వరకు షరతులు లేకుండా వ్యక్తిగత రుణాలు ఇవ్వాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన వారికి పింఛన్ అందజేయాలని, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాడ్ చేశారు. సంఘం నాయకులు భిక్షం, సత్తయ్య, బలరాం, దుర్గయ్య, నరేశ్, కృష్ణ, నర్సింహ పాల్గొన్నారు.

వైద్య పరీక్షల కోసం మిత్రుడికి చేయూత

రాజాపేట, నవంబర్ 1 : మండల కేంద్రానికి చెందిన గుర్రం హరిప్రసాద్ అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. విషయం తెలుసుకున్న 1985-86 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు అతని వైద్య పరీక్షల ఖర్చుల కోసం శుక్రవారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఠాకూర్ ధరమ్‌సింగ్, మార్త జగదీశ్, రంగారావు, ఠాకూర్ బాలాజీసింగ్, రఘువీర్‌సింగ్, ముకుందం, చంద్రమౌళి, ప్రకాశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.